# గులాబీ జెండాకు యువత గుండెకాయ

## సిద్దిపేటలో విద్యార్థి, యువత సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు



### ఏడాదికి 2 లక్షల ఉద్యోగాల భర్తీ బోగస్
### నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్
### నిరుద్యోగుల బాధలు రాహుల్‌గాంధీకి పట్టవా..

**ప్రత్యేక ప్రతినిధి, ఏప్రిల్ 13 సిరి న్యూస్:**
యువత, విద్యార్థులు గులాబీ జెండాకు గుండెకాయలాంటి వారని, సిద్దిపేట నుంచి పార్టీ రజతోత్సవ సభకు వెయ్యిమంది యువత, విద్యార్థులు పాదయాత్రగా తరలుదామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో యువత, విద్యార్థి సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.
సిద్దిపేట నుంచి చేసే పాదయాత్ర సిద్దిపేట 25 ఏండ్ల గులాబీ జెండాకు స్ఫూర్తి అన్నారు.కాంగ్రెస్ ఏడాదికి 2లక్షల ఉద్యోగాలభర్తీ అంతా బోగస్ అని ఆయన విమర్శించారు. 6వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయకుండా 55 వేలు భర్తీ చేసినట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. నిరుద్యోగయువతను నిలువునా మోసం చేసిన కాంగ్రె స్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కపట ప్రేమ చూపి నిరుద్యోగులను ఎన్నికల ముందు వాడుకొని వదిలేసిందన్నారు.
గద్దెనెక్కిన తర్వాత నిరుద్యోగుల గుండెల మీద తన్నుతున్నదని అన్నారు. ఆనాడు నిరుద్యోగుల కోసం ప్రొఫెసర్ కోదండరామ్, రియాజ్, బల్మూరి వెంకట్, మురళి, రేవంత్‌రెడ్డి తదితరులు అశోక్‌నగర్‌లో కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరిగారని, బస్సు యాత్రలు చేశారని, రాహుల్ గాంధీని అశోక్‌నగర్‌కు తీసుకువచ్చి ప్రామిస్‌లు చేయించారన్నారు. వీరికి మాత్రం ఉద్యోగాలు వచ్చాయని, నిరుద్యోగులకు మాత్రం రాలేదని హరీశ రావు అన్నారు.రాహుల్‌గాంధీ అశోక్‌నగర్‌కు వచ్చి 2 లక్షల ఉద్యోగాలు ఏడాదిలో భర్తీ చేస్తామని హామీ ఇచ్చి ఏడాదిన్నర పూర్తయిందని, ఎందుకు జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీకి నిరుద్యోగుల బాధలు కనపడడం లేదా, వినపడడం లేదా అన్నారు. నిరుద్యోగ భృతి ఉట్టి మాటే అన్నారు.రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని హరీశ్‌రావు కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌వీ యువజన విభా గం నియోజకవర్గ అధ్యక్షుడు నిమ్మ రజనీకాంత్‌రెడ్డి, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి, విద్యార్థి విభాగం పట్టణ అధ్యక్షుడు మహిపాల్‌గౌడ్, బీఆర్‌ఎస్‌వీ మాజీ అధ్యక్షుడు మెరుగు మహేశ్, నాయకులు భానుచందర్‌గౌడ్, రవి, గుజ్జ రాజు, వేణు, యువకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

**నారాయణఖేడ్ ఏప్రిల్ 13 (సిరి న్యూస్)**




టిఎస్ యుటిఎఫ్ 12వ ఆవిర్భావ వేడుకలను ఆదివారం నారాయణఖేడ్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న సంఘం భవనం వద్ద జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సాయిలు, కాశీనాథ్ యాదవ్, అశోకులు మాటాడుతూ 1974లో అన్ని ప్రాంతాల్లో అన్ని మేనేజ్మెంట్లలో రాష్ట్రవ్యాప్తంగా ఒకే ఉపాధ్యాయ సంఘం ఉండాలని ఆలోచనతో ఈ సంఘాన్ని యుటిఎఫ్ పేరుతో ఏర్పాటు చేశామన్నారు. తమ సంఘం ద్వారా హక్కులతో పాటు బాధ్యతల గురించి పోరాటాలు చేశామని తెలంగాణ ఏర్పడిన అనంతరం టీఎస్ యుటిఎఫ్ ద్వారా 30% పిఆర్సి సాధించడమే కాకుండా గత సంవత్సరం పదోన్నతులు కూడా సాధించుకోవడం జరిగిందన్నారు ప్రభుత్వ విద్యావిధానాన్ని బలోపేతం చేయాలన్నారు. యూపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా స్థానిక నాయకులు నరేష్, నరసయ్య, హరి సింగ్, జ్యోతి లింగం, ఏసుదాసు, శ్రీరాం నాయక్, రాములు అంజయ్య నర్సింలు హనుమాన్లు, శ్యామ్ రావు, మారుతి పాల్గొన్నారు.

## సెలవు రోజు కూడా రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ

**రామాయంపేట, ఏప్రిల్ 13 సిరి న్యూస్ :**
రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను సెలవు రోజు కూడా తీసుకోవడం జరుగుతుందని రామాయంపేట ఎంపీడీవో షాజులుద్దీన్ పేర్కొన్నారు. ఆదివారం ఎంపీడీవో తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఆర్‌వైవి దరఖాస్తులకు ఏప్రిల్ 14వ తేదీ (సోమవారం) చివరి రోజు అయినా దరఖాస్తుల ప్రక్రియ సాయంత్రం 5గంటల వరకు మండల కేంద్రంలో కొనసాగుతుందన్నారు. ఇప్పటికే 1500లకు పైగా ధరఖాస్తులు రావడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టి ఈ పథకాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# కోట్లాది భారతీయుల ఆశాజ్యోతి, భారత రాజ్యాంగ నిర్మాత డా.బీ.ఆర్. అంబేద్కర్

## నేడు ఆయన జయంతి

**ప్రతిభ అనేది కుల,మతాలకు తలవంచదు. పట్టుదల తపన కృషి ఉంటే మనుషులు ఋషులవుతారని అక్షరాలా సత్యమని నిరూపించిన మేధావి మహానుభావుడు డా. భీమ్ రావు అంబేద్కర్.**

కుల వివక్షత జడలు విప్పి స్వైర విహారం చేస్తున్న రోజుల్లో వాటిని ఎదుర్కోవడానికి నడుం బిగించిన ధీశాలి. నిమ్న కులంలో పుట్టిన అంబేద్కర్ ఒక ఒంటరి సైన్యం. ఉద్దండలను ఢీకొంటూ అపూర్వ యుద్ధం చేశాడు. అసమాన తలపై సమరంలో అచంచలదుర్గం.ఎవరెన్ని అవరోధాలు సృష్టించినా ఆజన్మాంతం లక్ష్యం వీడలేదు. అంటరానితనాన్ని తుద ముట్టించడంలో శిఖర సమానం. పరంపరాగతంగా సాగుతున్న దురాగతాల్ని దునుమాడటంలో వీసమెత్తు వెనకాడ లేదు అంబేద్కర్. అసమాన విద్యావంతుడు. భారత రాజ్యాంగ నిర్మాత. దళిత చైతన్య మూర్తి. రాజనీతి కోవిదుడు. న్యాయ శాస్త్ర దిట్ట. పరిపాలన దక్షుడు. గ్రంథ రచనా దురంధరుడు. అంబేద్కర్ బహుముఖీనత గురించి ఎన్ని చెప్పినా తక్కువే... అయినా ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన కోట్లాది భారతీయుల ఆశాజ్యోతి. ఈ దేశ భవితకు ఆయన ఆలోచనలు, అభిప్రాయాలు నేటికీ మూలాధారాలే.అంటరానితనం,కుల నిర్మూలన కోసం ఎంతో కృషిచేసిన డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ పూర్తి పేరు భీమ్ రావు రాంజీ అంబేద్కర్. తర్వాతి కాలంలో డా.బాబాసాహెబ్



అంబేద్కర్ గా కూడా పిలవబడుతున్న ప్రముఖ భారతీయ న్యాయవాది, ఆర్థికవేత్త,రాజకీయవేత్త,సంఘసంస్కర్త, స్వాతంత్ర్య భారత మొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రి, రాజ్యాంగ శిల్పి అంబేద్కర్. ఈయన 1891 ఏప్రిల్ 14న మధ్య ప్రదేశ్ లోని'మౌ' గ్రామంలో రాంజీ మాలోజి సాక్పాల్,బీమా బాయి దంపతులకు చివరి సంతానంగా జన్మించాడు.
అంబేద్కర్ బాల్యంలో అనుభవించిన బాధలు చివరికి యావత్ భారత దేశానికి వరంగామారాయి. తన చిన్నతనంలో సామాజిక వ్యవస్థ పట్ల నిరుత్సాహానికి గురై అంటరాని వానిగా పిలవబడే వారికి న్యాయం చేయాలని దృఢ సంకల్పంతో భీమ్ సక్పాల్( అతని చిన్ననాటి పేరు) ఉన్నత విద్యను అభ్యసించడానికి బొంబాయి కి వెళ్ళాడు. అక్కడ అతను మలియార్( నిమ్న కులం)అని దుకాణదారుడు కి చెప్పాడు. వెంటనే ఆ దుకాణదారుడు ఆయనను తరిమికొట్టాడు.ఆ విషయంపై ఆలోచించి, పట్టుదలతో ఎదుర్కొని భారతీయ సామాజిక దృక్పథంతో నక్షత్రంలా మెరిసిపోయే ఎత్తుకు ఎదిగిపోయి ప్రపంచానికే మార్గదర్శకుడయ్యాడు. భారతరత్న అయ్యాడు.కుల వ్యవస్థ శ్రమ విభజ నే కాదు. అది శ్రామికుల విభజన కూడా. కుల వ్యవస్థ మనుషులను జాతిరీత్య విభజించలేదు. అది ఒకే జాతిలోని ప్రజలను సాంఘికంగా విభజించింది.కులం పునాదుల మీద మీరు దేనిని నిర్మించలేరు. ఒక జాతిని నిర్మించలేరు. ఒక నీతిని నిర్మించలేరు.ప్రపంచంలో పైకి రాలేమన్న దురభిప్రాయం మీలో కొందరిలో ఉంది. నిస్సహాయత యుగం అంతమైందని గుర్తుంచు కోండి. మరో నూతన శకం ప్రారంభమైంది. మీ జీవితం మీరు పుట్టకముందే నిర్ణయమై పోయిందన్న మూఢనమ్మకాన్ని వదిలేయండి. మీ సుఖదుఃఖాలు పేదరికం దేవుడు నిర్ణయించినవి కానే కావు. వాటి నుంచి విముక్తి లేదని నిరాశ పడొద్దు.